ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

మంగళవారం 27 ఫిబ్రవరి 2024

నేడు సాలూరుకు నారా భువనేశ్వరి

సాలూరు/రూరల్,ఫిబ్రవరి 26: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి మంగళవారం సాలూరు రానున్నారు. తొలుత పట్టణంలోని ఇప్పిలివీధిలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే సంజీవని ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ నెల 27న మధ్యాహ్నం 12 గంటలకు విమానంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు ఆమె చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో మధ్యాహ్నం 3:40 గంటలకు సాలూరు చేరుకుంటారు. ఆరోగ్య కేంద్రం ప్రారంభం తదితర కార్యక్రమాల్లో 40 నిమిషాల పాటు పాల్గొంటారు. రాత్రి 8.20 గంటలకు అరకు చేరుకుంటారు.

తాళ్లతో కట్టి.. హింసించి..



చోరీ జరిగిన ఇల్లు ఇదే..



బాధితుడు శ్రీరామ్మూర్తి నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

- భార్యాభర్తలపై దాడి ● ఖడ్గవలసలో భారీ చోరీ
- 100 తులాల బంగారం, రూ. 50 వేలు దోచుకెళ్లిన దుండగలు
- సీసీ కెమెరాల సామగ్రిని తీసుకెళ్లిన వైనం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 26: ప్రశాంతంగా ఉండే ఖడ్గవలసలో సోమవారం భారీ చోరీ జరిగింది. దుండగలు భార్యాభర్తలపై దాడి చేసి ఏకంగా వంద తులాల బంగారం.. రూ.50 వేల నగదును దోచుకెళ్లారు. సీసీ కెమెరాల సామగ్రిని సైతం అపహరించారు. ఎన్నడూ లేని విధంగా గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనతో పరిసర ప్రాంతవాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రహదారికి ఆనుకొని ఉన్న ఇంటిలో దొంగతనం జరగడంతో ఆ ప్రాంతంలో వర్తకులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోషపురం పంచాయతీ ఖడ్గవలస సమీపంలో రైస్ మిల్లు యజమాని కిమిడి శ్రీరామ్మూర్తి, రత్నం దంపతులు నివసిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఆ ప్రాంతంలోని ఆయన రైస్ మిల్లు నిర్వహిస్తున్నారు. కాగా ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఆ గృహంలో ఆ దంపతులే ఉంటున్నారు. వారి ఇద్దరు కుమారులు వేరే ప్రాంతంలో ఉంటున్నారు. అయితే సోమవారం ఉదయం 5 గంటలకు ఇంటి అవసరాల కోసం మోటారు వేసేందుకు యజమాని శ్రీరామ్మూర్తి వెళ్లిన సమయంలో ఆరుగురు వ్యక్తులు ఇద్దరేసి చొప్పున మూడు గ్రూపులుగా విడిపోయి ఆ గృహంలోకి చొరబడ్డారు. వారిలో ముసుగు ధరించిన ఇద్దరు దుండగలు ఒక్కసారిగా శ్రీరామ్మూర్తిపై దాడి చేశారు. దీంతో ఆయన షాక్‌కు గురయ్యారు. కాగా అంతకముందే చోరులు బాత్‌రూముకు ఆనుకుని ఉన్న సీసీ కెమెరాను తొలగించారు. ఇంతలో మరో ఇద్దరు దుండగులు ఇంటిలోకి ప్రవేశించి.. డబ్బు, నగలు ఎక్కడ ఉన్నాయని యజమాని భార్య భాగ్యరత్నంను ప్రశ్నించారు. ఆ సమయంలో దంపతులిద్దరూ ఏమీ చెప్పకపోవడంతో వారిని తాళ్లతో కట్టి చోరులు హింసించారు. పిడిగుద్దులతో దాడి చేసి.. కొంతమేర ఊపి రాడకుండా చేశారు. దీంతో విలవిల్లాడిపోయిన ఆ దంపతులు తమను ఏం చేయొద్దని వేడుకున్నారు. అయినా చోరులు వారిని వదిలిపెట్టలేదు.

రూ. 2 కోట్లు డిమాండ్

దొంగల గుంపు తొలుత ఆ దంపతులను రూ. 2 కోట్లు డిమాండ్ చేసింది. రైస్ మిల్లును స్వాధీనం చేసుకుంటామని బెదిరించారు. ఇంట్లో ఎంతమేర నగదు, బంగారం ఉందో చెప్పాలని తీవ్రస్థాయిలో భయపెట్టారు. తాళాల గురించి అడిగినా ఆ భార్యభర్తలు చెప్పకపోవడంతో చోరులు వారిపై దాడి చేశారు. అనంతరం తాళాలు స్వాధీనం చేసుకుని సుమారు 100 తులాల బంగారం, రూ. 50 వేలు నగదును దోచుకెళ్లారు. చోరీకి పాల్పడిన ఆరుగురు వ్యక్తులు తెలుగు, హిందీ భాషల్లో మాట్లాడారని, ఇంటిలో వెండి వస్తువులపై దృష్టి సారించలేదని, కేవలం బంగారం, నగదునే దోచుకెళ్లారని బాధితులు తెలిపారు. అదేవిధంగా ఇంటి బయట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో పాటు హార్డ్ డిస్కులను తొలగించి తీసుకువెళ్లారన్నారు. ఈ ఘటనపై వారు గరుగుబిల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు

ఖడ్గవలస సముదాయంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన చోరీ ఘటనలో నిందితులను పట్టుకొనేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు తెలిపారు. చోరీ జరిగిన ఇంటిని, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీలను ఆయన పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు కూడా చేరుకుని వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు. కాగా ఈ చోరీలో సుమారు ఆరుగురు వ్యక్తులు పాల్గొన్నారని, ఘటనపై పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరిస్తున్నామని ఆయన తెలిపారు. మొత్తంగా ఆరు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. చోరుల దాడిలో గాయపడిన భార్యాభర్తలను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించామన్నారు. తెలివిగా సీసీ కెమెరాలను తొలగించిన చోరులు .. ఆ కుటుంబానికి తెలిసిన వ్యక్తులా, లేక బయట వారా? అన్న దానిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నామన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ పరిశీలనలో చిన మేరంగి, పాలకొండ సీఐలు కె.మురళీధర్, పి.సత్యనారాయణ, క్లూస్ టీం సీఐ డి.సుధాకరరావు, గరుగుబిల్లి ఎస్ఐ వై.అమ్మన్నరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



ప్రహరీకి ఆనుకొని వెనుక భాగంలో ఉన్న సీసీ కెమెరాలను తొలగించిన దృశ్యం



చోరీ ప్రాంతంలో పరిశీలన చేస్తున్న క్లూస్ టీం

గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి

● డీఎంహెచ్‌వో జగన్నాథరావు

పార్వతీపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని డీఎంహెచ్‌వో జగన్నాథరావు ఆదేశించారు. వసతిగృహ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంగా పనిచేయాలన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థుల మరణాలపై సమీక్షించారు. మక్కువ, పాచిపెంట, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో సంభవించిన ఘటనలపై ప్రోగ్రాం అధికారులు, స్పెషలిస్టు వైద్యులు, వైద్యాధికారులతో చర్చించారు. నివేదికలను పరిశీలించి అందుకు గల కారణాలపై ఆరా తీశారు. గిరిజన విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే హాస్టల్, స్కూల్ సిబ్బంది సత్వరమే తెలియజేయాలన్నారు. సమావేశంలో ఆర్‌బీఎస్‌కే అధికారి భాస్కరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

1న పాలకొండలో జాబ్‌మేళా

పార్వతీపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మార్చి1న పాలకొండలోని సత్యసాయి డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి జేసీ, ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ఐటీ, ఫార్మా, హెల్త్, బ్యాంకింగ్, మ్యానిఫ్యాక్చరింగ్, ఆటోమేటివ్, ఎలక్ట్రానిక్స్ తదితర 13 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ చదివిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. స్కిల్‌యూనివర్స్‌ఏపీఎస్‌ఎస్‌డీసీ.ఇన్‌వెబ్‌సైట్‌లో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 63012 75511, 70320 60773, 79937 95796 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. అనంతరం జాబ్‌మేళా పోస్టర్లను విడుదల చేశారు.

ఏపీ జేఏసీకి సాలూరు కో చైర్మన్ రాజీనామా

● సంఘ అధ్యక్షుడు 'బండి' తీరును వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడి

సాలూరు రూరల్, ఫిబ్రవరి 26: ఏపీ జేఏసీ ఉద్యమాన్ని మధ్యలో నీరుగార్చిన అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు తీరుపై ఉద్యోగ, ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ఆయన తీరుకు నిరసనగా ఏపీ జేఏసీ సాలూరు కో చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు మీసాల వెంకట గౌరీశంకరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో ఈ నెల 27న జరగాల్సిన చలో విజయవాడ కార్యక్రమాన్ని ఏపీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అర్ధాంతరంగా వాయిదా వేయడం తగదన్నారు. బండి తీరును వ్యతిరేకిస్తున్నామన్నారు. కనీసం ఐఆర్, డీఏలకు, ఒకటో తేదీన జీతాలకు ప్రభుత్వం సముఖత వ్యక్తం చేయకపోయిన నోట్ ఇచ్చారంటూ ఉద్యమాన్ని వాయిదా వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అందుకే తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. వివిధ సమస్యలపై ఈ నెల 29న ఏపీటీఎఫ్ పాత తాలూకా కేంద్రాల్లో నిర్వహించే ధర్నాకు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉప ముఖ్యమంత్రి ఇంటి ముట్టడి

● గిరిజన విద్యార్థుల మరణాలు కట్టడి చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్



ఉప ముఖ్యమంత్రి ఇంటి ముందు బైఠాయించి నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు , గిరిజన విద్యార్థులు

సాలూరు,ఫిబ్రవరి 26: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులు మరణాలు కట్టడి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రాజు, పండు డిమాండ్ చేశారు. సోమవారం విద్యార్థులతో కలిసి సాలూరులో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఇంటిని ముట్టడించారు. తొలుత వారు పట్టణంలోని బోస్‌బొమ్మ జంక్షన్ నుంచి జైపూర్ రోడ్డు మీదుగా డిప్యూటీ సీఎం ఇంటి వరకు ర్యాలీగా వెళ్లారు. ఆ తర్వాత ఆయన ఇంటి ముందు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నేతలు మాట్లాడుతూ.. గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల వరుస మరణాలపై సమగ్ర దర్యాప్తును జరపాలన్నారు. ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుంచి ఇప్పటివరకు సుమారు 17 మంది గిరిజన విద్యార్థులు మరణించినా.. ప్రజాప్రతినిధులు, ఐటీడీఏ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. తక్షణమే బాధిత కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఐటీడీఏ ద్వారా ఉద్యోగంతో పాటు రూ. పది లక్షల నష్టపరిహారం అందించాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించాలని, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని, రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని, మెస్ చార్జీలు పెంచాలని వారు నినాదాలు చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఉపముఖ్యమంత్రి రాజన్నదొర అమరావతిలో ఉండడంతో ఆయన పీఏ బేగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ నిరసనలో ఎస్ఎఫ్ఐ నాయకులు గంగారాం, అఖిల్, సింహాచలం, శ్రీను, లోకేష్, రంజిత్, రామకృష్ణ, రమేష్, గిరిజన విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురం రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు శ్రీకారం

● వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన పీఎం

బెలగాం, ఫిబ్రవరి 26 : అమృత్‌భారత్ పథకంలో భాగంగా ఎంపికైన పార్వతీపురం (బెలగాం) రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. సోమవారం స్టేషన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించగా.. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తంగా రూ.14.76 కోట్లతో స్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టను న్నారు. పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో భవనాల ఆధుని కీకరణతో పాటు వెయిటింగ్ హాల్స్, కేఫెటేరియా, స్థానిక ఉత్పత్తుల విక్రయానికి స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా అప్రోచ్ రోడ్డు, పార్కింగ్, లాండ్ స్కేపింగ్, ఆధునిక లైటింగ్ తదితర పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్, రైల్వే చీఫ్ మెకానికల్ ఇంజినీర్ సంజయ్‌కుమార్ మీనా, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ జగదీష్, బీజేపీ నాయకులు శ్రీనివాస్, నిమ్మక జయరాజు, మున్సిపల్ చైర్పన్ బి.గౌరీశ్వరి, రైల్వే అధికారులు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్ కుమార్, రైల్వే అధికారులు



ర్యాలీ చేస్తున్న ఆదివాసీ జేఏసీ సంఘం నాయకులు


ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

● ఆదివాసీ జేఏసీ సంఘం నిరసన

బెలగాం, ఫిబ్రవరి 26 : గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ఆదివాసీ జేఏసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో గిరిజనులు పార్వతీపురంలోని బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ చైర్మన్ కె.ధర్మారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీస్సీ నోటిఫికేషన్ వల్ల ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతందన్నారు. ఈ నేపథ్యంలో ఐటీడీఏ పరిధిలో ప్రత్యేక డీఎస్సీ ప్రకిటించాలని, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆరోగ్య భద్రత కల్పించి విద్యార్థుల మరణాలు ఆపాలని నినదించారు. ఐటీడీఏ పరిధిలో డిప్యూటీ డీఈవో పోస్టును సీనియర్ హెచ్ఎంతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరాలో కోత.. సాగునీటికి కటకట

- బ్రేక్ డౌన్ పేరుతో కరెంట్ నిలిపివేత
- నిరంతరాయంగా 9 గంటల పాటు అందించని వైనం
- హామీ అమలు చేయని సర్కారు
- రైతులకు తప్పని పాట్లు
- ఆందోళనలు చేపడుతున్నా.. మారని పరిస్థితి



పాచిపెంట, ఫిబ్రవరి 26 : పంటల సాగు కోసం రైతులకు తొమ్మిది గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని వైసీపీ సర్కారు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. బ్రేక్ డౌన్ పేరిట మండలాల్లో కరెంట్ ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు ఉండదో తెలియని పరిస్థితి. పంటలకు సక్రమంగా సాగునీరు అందకపోవడంతో రైతన్నలు రోడ్డెక్కాల్సి వస్తోంది. పాచిపెంట మండలం విషయానికొస్తే.. మైదాన, ఏజెన్సీ ప్రాంతాల్లో కేవలం వర్షాధారంపైనే సాగు చేసుకుంటున్న కొంతమంది రైతులు సుమారు 18 వరకు మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. అయితే విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడం వల్ల వారికి సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం మండలంలో సుమారు 20 వేల ఎకరాల్లో మొక్కజొన్న, పత్తి, పొగాకు, అరటి, వరి, తదితర పంటల సాగు చేపడుతున్నారు. అయితే వాటికి సకాలంలో నీరందకపోవడంతో నష్టం తప్పదని రైతులు భావిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే.. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోగా.. పెట్టుబడులు కూడా కోల్పోయే అవకాశం ఉందని వారు ఆవేదన చెందుతున్నారు. సర్కారు హామీ మేరకు రోజూ తొమ్మిది గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఇటీవల రైతులు పాచిపెంట సబ్‌స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం కూడా చేపట్టారు. అయినా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావం కారణంగా గత ఖరీఫ్‌లో తీవ్రంగా నష్టపోయామని, రబీలో అయినా నాలుగు రాళ్లు వెనకేసుకుందామనుకుంటే.. విద్యుత్ కోతలతో ఇబ్బందులు తప్పడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.



విద్యుత్ ఉన్న సమయంలో పంటలకు నీరు విడిచిపెడుతున్న రైతు (ఫైల్)

పొలాల్లో తప్పని నిరీక్షణ

సాగునీటి కోసం రోజూ 9 గంటల పాటు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండగా.. మండలంలో ఆరు గంటలు మాత్రమే కరెంట్ ఇస్తున్నారు. అయితే ఈ ఆరు గంటలు కూడా నెల రోజుల నుంచి బ్రేక్ డౌన్ పేరుతో మధ్య మధ్యలో సరఫరా నిలిపివేస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ త్రీఫేస్ సరఫరా చేస్తున్నారు. ఒక్కోసారి బ్రేక్ డౌన్ పేరుతో మధ్య మధ్యలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. దీనివల్ల రైతులు పొలాల్లోనే కరెంట్ కోసం నిరీక్షించాల్సి వస్తోంది. విద్యుత్ సరఫరా ఉన్న సమయంలోనే మోటార్లు ద్వారా పంటలకు సాగునీటిని విడిచిపెడు తున్నారు. ఏ సమయంలో బ్రేక్ డౌన్ అవుతుందేమోనన్న భయం వారిని వెంటాడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండలంలో రైతులు డిమాండ్ చేస్తున్నారు. రానున్న ఖరీఫ్‌లో ఇటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..

త్రీఫేస్ ఇచ్చిన ఆరు గంటల వ్యవధిలో కూడా మధ్య మధ్యలో బ్రేక్ డౌన్ పేరుతో సరఫరా నిలిపివేస్తున్నారు. దీనివల్ల రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు.

\- పూసర్ల నర్సింగరావు, రైతు, పాచిపెంట

మరమ్మతులు చేపట్టిన రోజే..

అకస్మాత్తుగా మరమ్మతులు చేపట్టిన రోజే బ్రేక్ డౌన్ చేస్తాం. దీనివల్ల సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. పంటలకు సంబంధించి విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం మళ్లీ నూతన షెడ్యూల్ ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

\- పెంట రమేష్, విద్యుత్‌శాఖ ఏఈ, పాచిపెంట

మద్యంతో రూ.లక్ష కోట్ల సంపాదన



మాట్లాడుతున్న కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట, ఫిబ్రవరి 26: మద్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రూ.లక్ష కోట్లు అక్రమంగా సంపాదించారని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆరోపించారు. సోమవారం ఎల్.కోటలో విలేకరులతో మాట్లాడుతూ పూర్తిగా మద్యపాన నిషేధం చేసి ఓట్లు అడుగుతానని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో ఏ మొహం పెట్టుకొని ప్రజల ముందుకు వస్తారని ప్రశ్నించారు. నాశిరకం మద్యం తాగి రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల మంది అనారోగ్యం పాలయ్యారని తెలిపారు. 30 వేల మంది ప్రాణాలు వదిలారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల పార్టీ నాయకులు చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, పోతుల వెంకటరమణ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆధునాతన పరిజ్ఞానంతో పిల్లలకు గుండె శస్త్ర చికిత్సలు



శస్త్ర చికిత్సల అనంతరం చిన్నారులతో వైద్య బృందం

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని తిరుమల మెడీకవర్ ఆసుపత్రిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించామని ఆసుపత్రి ఎండీ డాక్టర్ తిరుమల ప్రసాద్ అన్నారు. సోమవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెద్దవారికి మాత్రమే గుండె శస్త్ర చికిత్సలు నిర్వహిస్తుండగా, ప్రస్తుతం పదేళ్లలోపు పిల్లలకు కూడా ఆధునిక పరిజ్ఞానంతో కుట్టు, కోత లేకుండా గుండె శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇటీవల జిల్లాలోని మెంటాడ మండలానికి చెందిన సబ్బిశెట్టి శ్రావణి, గరివిడి మండలానికి చెందిన దాక్షాయని ఇద్దరు బాలికలకు ఆధునిక డివైజ్ క్లోజర్ ప్రొసిజర్ ద్వారా విజయవంతంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ శస్త్ర చికిత్సలను ఆరోగ్య శ్రీద్వారా ఉచితంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వైద్య బృందం పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలనూ వదలరా?

రామభద్రపురం: 'అధికార వైసీపీ నాయకులు ప్రభుత్వ స్థలాలను కూడా విడిచిపెట్టరా?' అని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు ప్రశ్నించారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బూసాయవలసలో చెరువు గర్భాలు, ప్రభుత్వ పాఠశాలల స్థలాలను అధికార పార్టీ ఎమ్మెల్యే పేరు చెప్పుకొని కొంతమంది నాయకులు వీఆర్వో ద్వారా తప్పుడు పత్రాలు సృష్టించుకొని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. పాపారావు పాల్గొన్నారు.

నేడు ఎస్.కోటలో డయల్ యువర్ డీఎం

శృంగవరపుకోట: శృంగవరపుకోట ఆర్టీసీ డిపోలో మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. 9959225619, 7382923679 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శృంగవరపుకోట: శృంగవరపుకోట మండల పరిధిలో పలు గ్రామాలకు మంగళవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ సహాయ ఇంజినీర్ ఆర్.రవికుమార్ తెలిపారు. సీతారాంపురం, గోపాలపల్లి, కొట్టాం, చామలాపల్లి, రేవళ్లపాలెం, కె.గోపాలపల్లి, వేములాపల్లి, కొత్తకోట, గంట్రాజు కళ్లాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

రింగురోడ్డు: దాసన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 28న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పూడి హరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 2గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్ల భర్తీకి నోటిఫికేషన్

తెర్లాం: ఆర్టీఈ యాక్టు 2009 ప్రకారం 2024-25 విద్యా సంవత్సరంలో ప్రైవేటు స్కూల్‌లో 25 శాతం సీట్లు పొందేందుకు 1వ తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈవో త్రినాథరావు తెలిపారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకొని ప్రైవేటు పాఠశాలలో చేరే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈకేవైసీ తప్పనిసరి

రామభద్రపురం: రైతు భరోసా కోసం రైతులంతా ఈకేవైసీ చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యాంసుందర్ తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈకేవైసీ చేయని రైతులకు కేంద్రం అందించే ప్రోత్సాహం అందదని అన్నారు. ఏవో వెంకటప్పయ్య, వ్యవసాయ శాఖ ఉద్యోగి కొండలరావు పాల్గొన్నారు.

ప్రసాదాల విక్రయానికి వేలం

వంగర: మహాశివరాత్రి సందర్భంగా సంగాంలోని సంగమేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించనున్న జాతరలో ప్రసాదాలు అమ్ముకునేందుకు వేలం పాట రూ.81 వేలకు ఖరారైందని ఈవో శ్యామలరావు తెలిపారు. మార్చి 8 నుంచి 14వ తేదీ వరకు ఆలయ ప్రాంగణంలో పులిహోరా, లడ్డు విక్రయాలకు వేలంలో అనుమతించామని చెప్పారు.

మరిడిమాంబ తీర్థ మహోత్సవం

లక్కవరపుకోట: రంగారాయపురంలో మరిడిమాంబ తీర్థ మహోత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం నుంచి గ్రామస్థులు అమ్మ వారికి కుంకుమ పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు దంపతులు అమ్మవారికి పూజలు చేశారు. సాయంత్రం గుర్రాల పందెం నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మంగళవారం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించనున్నట్టు కమిటీ తెలిపింది.

నిబద్ధతోనే మన్ననలు

విజయనగరం రింగురోడ్డు: వృత్తిలో అంకిత భావం, నిబద్ధత ఉంటే ఏ అధికారి అయినా, అందరి మన్ననలు పొందుతారని విశ్రాంత పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ నర్సింహులు అన్నారు. జిల్లా సీమ పందుల పునరుత్పత్తి విభాగ సహాయ సంచాలకులు రాజా తిమ్మారెడ్డి బదిలీపై తిరుపతి వెళ్తున్న సందర్భంగా వీటీ అగ్రహారంలోని కార్యాలయంలో ఆయనను ఘనంగా సత్కరించారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

● పార్టీ తీర్థం పుచ్చుకున్న పలు మండలాల వైసీపీ మద్దతుదారులు



రాజాం: కోండ్రు మురళి ఆధ్వర్యంలో..



పాచిపెంట: సంధ్యారాణి ఆధ్వర్యంలో..



పార్వతీపురంలో..

వంగర/రాజాం: టీడీపీలోకి భారీగా చేరికలు చోటుచేసుకుంటున్నాయి. వైసీపీ మద్దతుదారులు పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. అరసాడకు చెందిన చెందిన సుమారు 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మజ్జి వెంకటనాయుడు, డైరెక్టర్ పరశబోతు వెంకటరావు, బీసీ నాయకులు కొరటాన గౌరునాయుడు, దొంతల దుర్గారావు, వార్డు సభ్యుడు రాగోలు రమేష్, మురళి, అశోక్ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ధనలక్ష్మి, లక్షభక్త కృష్ణమూర్తి, మజ్జి గణపతి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మజ్జి వెంకటనాయుడు తదితరులు ఉన్నారు.

పాచిపెంట: తుమరావిల్లి, మిలియాకంచూరు గ్రామ పంచాయతీల నుంచి సుమారు 300 మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. సోమవారం ఆ గ్రామాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు, సాలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మడి సంధ్యారాణి నాయకులకు, కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మహిళలు, యువత వచ్చి పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు సంధ్యారాణి మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు, గ్యాస్ ధరలు, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సామాన్య ప్రజలు బతకడం కష్టసాధ్యమవుతోందని అన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదని గిరిజన లబ్ధిదారులు ఫిర్యాదులు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముఖి సూర్యనారాయణ, కొత్తల పోలినాయుడు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పట్టణంలో ఒకటో వార్డుకు చెందిన టీడీపీ నాయకులు హరేరాం బాబ్జీ, ఆయన సతీమణి ఉషా గత కొన్నేళ్లగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. వీరు సోమవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరితో పాటు పది కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పార్టీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బర్నాల సీతారాం, జనసేన నాయకలు చందక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 175 వినతులు



వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో అనిత

విజయనగరం (ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 26: 'జగనన్నకు చెబుదాం'లో వివిధ సమస్యలపై ప్రభుత్వ శాఖలకు ప్రజల నుంచి అందిన వినతులను సకాలంలో పరిష్కరించాలని డీఆర్‌ఓ అనిత ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో డీఆర్వోతో పాటు, అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్, కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సుమబాల, మురళీకృష్ణ, ఆర్డీఓ సూర్యకళతో కలసి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 175 వినతులు అందాయి. రెవెన్యూ సమస్యలపై 129, డీఆర్‌డీఏకి సం బంధించి 4 , గ్రామ, వార్డు సచివాలయ శాఖకు 15, జిల్లా పంచాయితీ శాఖకు 12, గృహ నిర్మాణ శాఖకు 7, జిల్లా ఆసుపత్రులకు సంబంధించి 3, విద్యుత్ పంపిణీకి సంబంధించి 1, మున్సిపల్ శాఖకు 4 చొప్పున వినతులు అందాయి.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



బేబీనాయనకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

రామభద్రపురం, ఫిబ్రవరి 26: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బొబ్బిలి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బేబీనాయన కోరారు. రామభద్రపురం మండలం రొంపల్లి ఎంపీటీసీ భవిరెడ్డి శంకరరావు, జనసేన నాయకుడు మహేష్‌ల ఆధ్వర్యంలో కార్యకర్తలు సోమవారం సాయంత్రం టీడీపీ అభ్యర్థిగా ఎంపికైనందుకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని సూచించారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు ఐకమత్యంతో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

భూ కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

● ఎస్పీ దీపిక ● స్పందన కార్యక్రమానికి 41 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ దీపిక

విజయగనగరం (క్రైం): జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో భూకబ్జాలకు పాల్పడిన వారిపై విచారణ చేపట్టి చట్టపరిధిలో కఠిన చర్యలు తీసుకోవాలని, ఎస్పీ దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి, 41 ఫిర్యాదులు స్వీకరించారు. ● గుర్ల మండలం వల్లాపురం గ్రామానికి చెందిన మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేస్తూ తన భూమిని అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు దురాక్రమణకు పాల్పడి అందులో ఉన్న టేకు చెట్లను నరికి తీసుకువెళ్లారని, న్యాయం చెయ్యాలని కోరారు. ● కొత్తవలస మండలం అప్పన్నదొరపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి ఎస్పీకి ఫిర్యాదుచేస్తూ తనకు చెందిన 3 ఎకరాల భూమిని రెల్లి గ్రామానికి చెందిన వ్యక్తి తీసుకున్నారని, సదరు వ్యక్తి తనపేరున 50 సెంట్లు భూమిని రిజిస్ట్రేషన్ చేయిస్తానని అగ్రిమెంట్ రాయించుకుని నేటి వరకు రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని, న్యాయం చెయ్యాలని కోరారు. ● మెంటాడ మండలం లోతుగెడ్డకు చెందిన వ్యక్తి ఎస్పీకి ఫిర్యాదు చేస్తూ తనకు ఓ ప్రైవేట్ కంపెనీ వారులోన్ ఇప్పిస్తానని నమ్మించి, డాక్యుమెంటేషన్ చేయించుకుని లోన్ ఇవ్వకుండా తన బ్యాంక్ అకౌంట్ నుంచి ఈఎంఐ ద్వారా కొంత నగదును బదిలీ చేయించుకున్నారని, న్యాయం చెయ్యాలని కోరారు. ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ తక్షణమే సమస్యను పరిష్కరించి, తీసుకున్న చర్యలను నివేదించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అస్మాపరహీన్, ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్, సీఐలు విజయ్‌నాథ్, నర్సింహమూర్తి, ఎస్.ఐలు గణేష్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన కోండ్రు



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కోండ్రు

రాజాం, ఫిబ్రవరి 26: శ్రీకాకుళం జిల్లాలో 'రా..కదలిరా' సభకు హాజరైన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును మాజీ మంత్రి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాజాం నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో తిరుగులేని మెజార్టీ సాధించాలని చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

టీడీపీ గెలుపునకు కృషి

విజయనగరం రింగురోడ్డు: రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు బ్రాహ్మణులంతా సంఘటితంగా కృషి చేయాలని జాతీయ ఉపాధ్యక్షుడు, కోర్ కమిటీ సభ్యుడు జంధ్యాల బుచ్చిబాబు, రాష్ట్రసీనియర్ ఉపాధ్యక్షుడు భోగావురపు వాయునందన శర్మ అన్నారు. సోమవారం ఓం మందిరం వద్ద గల రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన సంస్థ (తెలుగుదేశం అనుబంధ విభాగం) ఆత్మీయ సమావేశాన్ని కార్యాలయంలో నిర్వహించారు. బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు అందాలంటే బ్రాహ్మణ కార్పోరేషన్ పునరుద్దరించాల్సిన అవసరం వుందన్నారు. అందుకు టీడీపీ విజయం సాధించాల్సి వుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు దవళ వెంకటరావు, పేరి రామయ్య పంతులు, మళ్లా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్‌కు జాతీయ స్థాయి అవార్డు

విజయనగరం రింగురోడ్డు: విజయనగరం ఇన్నర్‌వీల్ క్లబ్‌కు ఈ ఏడాది నిర్వహించిన వివిధ సేవా సంక్షేమ కార్యక్రమాలకు గాను జాతీయ స్థాయి అవార్డు లభించిందని క్లబ్ అధ్యక్షురాలు కాపుగంటి సుధ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఇన్నర్‌వీల్ ఇండియా వెబ్‌సైట్‌లో డిసెంబరు, 31, 2023 వరకూ విజయనగరం ఇన్నర్‌వీల్ క్లబ్ 100 కంటే సేవా ప్రాజెక్టును చేసినందుకు ఆల్ ఇండియాస్థాయిలో టాప్‌గా నిలిచిందని పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో వీల్ ఆఫ్ ఇండియా ప్రతినిధి సరితా సునాని చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నామన్నారు.

న్యాయసాధన సభకు బంగారునాయుడు

శృంగవరపుకోట: అనంతపురంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన న్యాయసాధన సభకు శృంగవరపుకోట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడి బంగారునాయుడు, ఎస్సీసెల్ చైర్మన్ చీమల అచ్చిబాబు హాజరయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గే నిర్వహించిన ఈ సభకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపు మేరకు వెళ్లామన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ పనితీరుపై సభలో ఆరా తీసినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచాలి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): మహిళలకు, యువతకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని డీఆర్వో అనిత అన్నారు. ఆర్‌బీఐ రూపొందించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రీనివాసరావు, అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్, కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సుమబాల, మురళీకృష్ణ, ఆర్డీవో సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గాయత్రీ మాత జాతర

రాజాం రూరల్: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని గాయత్రీ వేదమాత 31వ వార్షిక జాతర మహోత్సవాలు ఈనెల 28 నుంచి మార్చి 1 వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కొండవేటి వివేకానందరావు ఓ ప్రకటనలో తెలియజేశారు. మూడు రోజుల పాటు విశ్వేశ్వర, సూర్యనారాయణ, కాశీ విశ్వేశ్వర, సత్యనారాయణమూర్తి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామితో కూడిన గాయత్రీ దేవికి కుంకుమార్చనలు చేశారు.

'స్పందన'కు ఫిర్యాదులు

తెర్లాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో మధుసూధనరావు ఆధ్వర్యంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధాన్య క్రమంలో అర్జీలను పరిష్కరిస్తామన్నారు. మండల స్థాయిలో పరిష్కారం కాని దరఖాస్తులను జిల్లా స్థాయి అధికారులకు పంపించి... పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

నామినేషన్ల వరకు మార్పులు

బొబ్బిలి: రానున్న ఎన్నికల్లో అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియకు ముందు రోజు వరకు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని ఎన్నికల డీటీ రెడ్డి సాయికృష్ణ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సంబంధిత ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో టీడీపీ, వైసీపీ, జనసేన, సీపీఎం, సీపీఐ, లోక్‌సత్తా, కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు సాయం

రేగిడి: దేవుదళ కేజీబీవీ ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు సంకిలి "షుగర్స్ యాజమాన్యం పరీక్షకు అవసరమైన కిట్లు అందించారు. సోమవారం ప్లాంట్ హెడ్ పట్టాభిరామిరెడ్డి, డీజీఎం కేన్ శ్రీరాజేంద్రన్, హెచ్‌ఆర్ హెడ్ మురళీ కృష్ణలు 60 మంది విద్యార్థులకు నోట్‌బుక్‌లు, అట్టలు, వాటర్ బాటిల్స్, అందించినట్లు ప్రిన్స్‌పాల్ ఎం.లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రతినిధి గవరయ్య, ఎంపీటీసీ ప్రతినిధి శ్రీహరి, ఉపాధ్యాయులు, షుగర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 26: మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలని నేతాజీ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెద్దింటి గుణకరరావు అన్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా సైనిక సంక్షేమ అధికారి డాక్టరు సత్యప్రసాద్‌ను సోమవారం ఆయన కార్యాలయంలో సంఘ ప్రతినిధులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సైనికపురి కాలనీ, సీఎస్‌డీ క్యాంటీన్, ఈహెచ్ఎస్ క్లీనిక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు ప్రకాష్‌రావు, యేసుదాను, గణపతిరావు, చలుమూరి హరనాథ్, టి మన్మథరావు, శివకుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో సత్తా చాటాలి




బహుమతులు అందిస్తున్న దృశ్యం

జామి, ఫిబ్రవరి 26: ఈ ఏడాది పది పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటాలని మండల విద్యాశాఖాధికారులు జయశ్రీ, గంగరాజులు అన్నారు. ఇటీవల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పది పరీక్షల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

రాజాం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునే విధంగా అందరూ కృషి చేయాలని మాజీ మంత్రి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళి సూచించారు. సోమవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో సంతకవిటి మండలం సిరిపురం ,కాకరాపల్లి, రామారాయపురం, మిర్తివలస, గ్రామాల నాయకులు కార్యకర్తలతో రివ్యూ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూపకల్పన చేసిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని సీఎం జగన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలపై మోయలేని పన్నుల భారం మోపుతున్నారని విమర్శించారు. ప్రజలపై పన్నుల భారంతో బలహీన వర్గాల రక్తం తాగుతున్న సీఎం జగన్ అన్నింటిపైనా ధరలు పెంచుకుంటూ పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్తపై కూడా పన్ను వేసిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ ల్లో రాజకీయ చైతన్యాన్ని తీసుకురావడమే కాకుండా వారికి రాజకీయ అధికారాలను ఇచ్చింది తెలుగుదేశం పార్టీ అన్నారు. గట్టి భాను, వల్లూరు గణేష్, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శిగా బంగారునాయుడు



బంగారు నాయుడు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 26: సంతగైరమ్మపేట పాఠశాల హెచ్ఎం కె.బంగారునాయుడును పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శిగా సోమవారం ఎన్నుకున్నారు. దీనిపై మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసులు నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర శాఖ గెజిట్ విడుదల చేసిందన్నారు. బంగారునాయుడు నియామకంపై సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇందుకూరి అశోక్‌రాజు, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు కర్రి మోహన్‌రాజు, సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

అంతర్ రాష్ట్ర కార్మికులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



సిబ్బందితో మాట్లాడుతున్న కొండలరావు

రాజాం/రూరల్, ఫిబ్రవరి 26: దుకాణాలు, వాణిజ్య, వ్యాపార సంస్థలు, మోటారు రవాణా యాజమాన్యాలు తదితరులు అంతర్ రాష్ట్ర కార్మికులను పనిలో పెట్టుకుంటే ఈనెల 29లోగా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రాజాం సహాయ కార్మిక శాఖ అధికారి బి.కొండలరావు సూచించారు. రాజాంలో సోమవారం ఒక బ్యాంకును సందర్శించి, అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసిన వారు సకాలంలో రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం 2015 కింద కార్మిక చట్టాలు అన్నింటికీ ఒకే రిజిస్ట్రేషన్ పొందే అవకాశం ఉందన్నారు. రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి, పొందూరు, జి.సిగడాం, ఆమదాలవలస మండలాలకు చెందిన వారు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కొండలరావు సూచించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బొండపల్లి/గంట్యాడ: విద్యుత్ షాక్‌కు గురై నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. బొండపల్లి మండలం జీపీ అగ్రహారం గ్రామానికి చెందిన చప్ప కృష్ణ (53) నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయన గ్రీన్‌ఫీల్డ్ నూతన రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా గంట్యాడ మండలం గింజేరు పరిధిలో రోడ్డు పనులు చేస్తున్నాడు. ఈ సమయంలో ఐరన్ పైప్‌ను ఒకచోట నుంచి మరోచోటుకు తరలిస్తుండగా పైన ఉన్న విద్యుత్ వైర్లకు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు గంట్యాడ మండలం పెదమజ్జిపాలెం పీహెచ్‌సీకి తరలించగా వైద్య పరీక్షలు జరిపి మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతుని బంధువులు పరిహారం అందజేయాలని హైవే సిబ్బందిని నిలదీశారు. ఎంపీపీ చల్లా చలంనాయుడు, మెంటాడ నాయకులు చలుమూరి వెంకటరావు, గ్రామ పెద్దలు సిరిపురపు సూర్యనారాయణ తదితరులు కలుగజేసుకొని మంతనాలు జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

మిస్సింగ్ కేసు నమోదు

విజయనగరం క్రైం: నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సీహెచ్ఎస్ఎన్ రాజు తెలిపారు. కంటోన్మెంట్ గంజిపేటకు చెందిన దేబారిక దేవి(25), ఆమె కుమార్తె ప్రాప్తిశ్రీ (2.5) ఈ నెల 25న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఎటువంటి సమాచారం తెలియక పోవటంతో భర్త శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేస్తున్నట్లు ఏఎస్ఐ సీహెచ్ఎస్ఎన్ రాజు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

రేగిడి: మండలంలో కొమిరవెంకటాపురంలో ఒకవ్యక్తి ఇంట్లో 15 మద్యం సీసాలు పట్టుబడినట్లు ఏఎస్ఐ మన్మథరావు తెలిపారు. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో బెల్ట్‌షాపు నిర్వహణకు తెచ్చిన మద్యాన్ని సీజ్‌చేసి నిర్వాహకుడిని అరెస్టు చేశామన్నారు. కానిస్టేబుల్స్ శివ, ఇతర సిబ్బంది ఉన్నారు.

యువతి అదృశ్యం

జామి: కుమారాం గ్రామానికి చెందిన పోలిపల్లి దుర్గ(22) అదృశ్యమైనట్టు ఎస్ఐ వీరబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న బ్యూటిఫికేషన్ కోర్సు నేర్చుకోవడానికి వెళ్తున్నట్టు కుటుంబ సభ్యులకు చెప్పి విజయనగరం వెళ్లిందని, తిరిగి ఇంటికి రాలేదని తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వాలీబాల్ విజేత లక్కవరపుకోట

కొత్తవలస: కంటకాపల్లి పంచాయతీ శారదా కర్మాగారం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కొత్తవలస జడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీలలో ప్రథమ బహుమతిని లక్కవరపుకోట జట్టు కైవసం చేసుకోగా.. కొత్తవలస, విజయనగరం, జామి జట్లు వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. గెలుపొందిన జట్లకు వరుసగా రూ.1.25లక్షలు, రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.25 వేల చొప్పున కర్మాగార యాజమాన్యం అందించింది. ఈ కార్యక్రమంలో కర్మాగార ప్రతినిధులు ప్రభాత్ మోహన్, సూర్యభాస్కర్, సన్యాసిరావు, శంకరరావు, సంతోష్ కుమార్, స్థానిక శాసన సభ్యుడు కె.శ్రీనివాసరావు, కొత్తవలస సర్పంచ్ మచ్చరామస్వామి, కాటకాపల్లి సర్పంచ్ మదిన రమణ, వాలీబాల్ సంఘ ప్రతినిధులు గవర సూరిబాబు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ లక్ష్యాలు నెరవేర్చాలి

సీతానగరం: సీతానగరం, పార్వతీపురం బలిజిపేట మండలాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి సిబ్బంది కృషి చేయాలని ఉపాధి జిల్లా పథక సంచాలకుడు కె.రామచంద్రరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మూడు మండలాల సహాయ ప్రోగ్రాం అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. శతశాతం వేతనదారులు రెండు పూటలా పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అక్రమ మస్టర్లు నిరోధించాలని కోరారు. వేతనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే వేటు తప్పదని హెచ్చరించారు. ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, ఏపీవోలు భాను, నాగలక్ష్మి, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం



సమీక్ష నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీవో సందీప్‌కుమార్

బొబ్బిలి, ఫిబ్రవరి 26: స్థానిక రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జి ఆర్డీవో కె.సందీప్ కుమార్ ఆధ్వర్యంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం అమలుపై సమీక్ష నిర్వహించారు. డివిజన్ స్థాయి వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డాక్టర్ సంతోషి కుమారి, డాక్టర్ పద్మావతి, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ ఎం.స్వాతి, పోలీసు అధికారి బీవీ రమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, సామాజిక కార్యకర్తలు శాంతి, చిన్నతల్లి పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

దాసన్నపేట: పూసపాటిరేగలో ఈ నెల 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజాం మండలం మండాకుర్తి గ్రామానికి చెందిన కోటిశెట్టి సోమేష్‌కుమార్ మృతి చెందారు. జిల్లా తెలగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పల్లంట వెంకటరామారావు సోమవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ● **రేగిడి:** ఇటీవల సంకిలి షుగర్స్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పొట్నూరు దిలీప్ కుటుంబానికి జనసేన రాజాం నియోజకవర్గ ప్రతినిధులు అండగా నిలిచారు. వైద్య ఖర్చుల నిమిత్తం మనోజ్, కొల్లా జయరాం, వారడ కిషోర్ బాధిత కుటుంబానికి రూ.13 వేలు ఆర్థిక సాయం అందించారు.

శ్రుతి మించుతున్న ఎన్నికల తాయిలాలు

● వెలుగు సిబ్బందికి ఎస్.కోట ఎమ్మెల్యే చీరలు పంపిణీ ● ఐప్యాక్ టీమ్ కనుసన్నల్లో విలేకర్లకూ ప్రలోభాలు



ఎస్.కోట నియోజకవర్గం కొత్తవలసలో వెలుగు సిబ్బందికి తాయిలాలు అందించిన దృశ్యం

(విజయనగరం-ఆంధ్రజ్యోతి): ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ వైసీపీ నాయకులు అడ్డదారులు వెతుకుతున్నారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోట నియోజకవర్గంలో ఐదు మండలాలకు చెందిన వెలుగు సిబ్బందిని పిలుపించుకుని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చీరల పంపిణీ చేపట్టారు. వెలుగులో పనిచేస్తున్న సుమారు 190మంది వీఓఏలతో కొత్తవలసలోని ఎమ్మెల్యే ఇంటి వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. హాజరైన వారందరికీ చీరలు అందించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ మహిళా సంఘాలకు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన మాదిరిగా రుణ మాఫీని చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిదేనని అన్నారు. ఏరియా కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో వీఓఏలు మహిళా సంఘాలకు వద్దకు వెళ్లి ముఖ్య మంత్రి చేపట్టిన సంక్షేమ పథకాల్లో భాగంగా రుణమాఫీ వంటి అంశాలను వివరించాలని కోరారు. ఎమ్మెల్యే కడుబండిని మళ్లీ గెలిపించుకుని జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని చెప్పాలని కోరారు. 'మీ సహకారంతో ఎంతో కొంత మంచి ఫలితం ఉంటుందని' నమ్ముతున్నామన్నారు. పేరుపేరునా పిలిచి చీరలను అందించారు. ఎస్‌కోట, కొత్తవలస, ఎల్.కోట, వేపాడ, జామి మండలాల నుంచి వీఓఏలు హాజరైనట్లు సమాచారం. వీఓఏలు వారి యూనిఫాంలో హాజరయ్యారు. ఇటీవల కొత్తవలసలో వలంటీర్లను పిలిచి వారికి సన్మానం చేశారు. ఎన్నికల్లో వారి సహకారాన్ని కోరారు. త్వరలో సమావేశం నిర్వహిస్తామని చెప్పి పంపించారు. అలాగే విలేకర్లకు అన్ని నియోజకవర్గాల్లోనూ తాయిలాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్.కోట, విజయనగరం వంటి చోట్ల ఇప్పటికే మీడియాకు ప్రలోభాలు అంటగట్టే తంతు చేపట్టారు.

వైసీపీని ఇంటికి పంపించాలి

- గ్రామాల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ
- సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

పార్వతీపురం రూరల్: వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయచంద్ర ప్రజలను కోరారు. బందులిప్పి పంచాయతీ నిమ్మవానివలస, తదితర గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు బోనుదేవి చంద్రమౌళి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జి.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు. ● **సీతానగరం:** సూపర్ సిక్స్ పథకాల వైపే ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. జనార్థనవలస గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో సోమవారం సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. పార్టీ నాయకులు మజ్జి అప్పారావు, బాబ్జీ, రాంబాబు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

వంగర: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని రాజాం నియోజకవర్గ పార్టీ మహిళా కార్యదర్శి ఎల్.ధనలక్ష్మి తెలిపారు. సోమవారం అరసాడలో చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి జగన్ అరాచకాలకు స్వస్తి పలకాలన్నారు.

● **కురుపాం:** కిచ్చాడ గ్రామంలో సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన




కురుపాం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, వంగర: మాట్లాడుతున్న ధనలక్ష్మి



పార్వతీపురం: విజయచంద్రను అభినందిస్తున్న జనసేన పార్టీ నాయకులు

పరిచారు. రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, కన్వీనర్ కేవీ కొండయ్య, జనసేన నాయకుడు వంశీ, కిచ్చాడ టీడీపీ నాయకులు శ్రీను, కిషోర్, శరత్, చరంజీవి, టీడీపీ కురుపాం నాయకులు కొట్టు వెంకటరమణ, ఎస్.వెంకటరమణ, చంటి, ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన విజయం తథ్యం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి విజయం తథ్యమని ఆ పార్టీల ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం జనసేన పార్టీ మండల అధ్యక్షురాలు ఆగూరు మణి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయచంద్రను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం రాబోతోందని అన్నారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలపై చర్యలు తీసుకోండి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

బెలగాం: గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాల ని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ ఎన్జీవో భవనంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పి.రంజిత్ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థుల మరణాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పలు గిరిజన సంఘాలు, సీపీఐ, రైతు సంఘాల నాయ కులు హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వారం రోజుల్లో నలుగురు గిరిజన విద్యార్థులు మృతి చెందినా అధికారులు పరామర్శించలేదని ఆవేదన చెందారు. బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గిరిజన పాఠశాలల్లో, కళాశాలల్లో, వసతి గృహాల్లో తరచుగా వైద్య శిబిరాలు నిర్వహించాలని, నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు అమర్నాథ్, టి.సాయిబాబు, రామకృష్ణ, సురేష్ కె.రాజు, ఎ.ప్రభాకర్, ఈవీ నాయుడు, పి.సంగం తదితరులు పాల్గొన్నారు.

ఆ మరణాలకు కారణమేంటి?

జియ్యమ్మవలస: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు ఇటీవల కాలంలో పిట్టల్లా రాలిపోతున్నారని... అసలేం జరుగుతోందని ఆదివాసీ గిరిజనాభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థుల మరణాలకు పౌష్టికాహారం లోపమో లేక వైద్యాధికారుల నిర్లక్ష్యమో తెలియడం లేదన్నారు. ఇటీవల విద్యార్థులు అనారోగ్యంతో ఆరోగ్య కేంద్రాలకు వెళుతుంటే రోగాన్ని గుర్తించకుండా తూతూ మంత్రంగా పరీక్షలు నిర్వహించి పంపిస్తున్నారని తెలిపారు. బాధిత విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వసతి గృహ విద్యార్థులపై అప్రమత్తం



విద్యార్థినిని పరీక్షిస్తున్న డీఎంవో

సీతానగరం: వసతి గృహ విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్‌మోహనరావు ఆదేశించారు. జోగింపేట పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్, కేజీబీవీ, డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులాలను ఆయన సోమవారం సందర్శించారు. జ్వరాలు గుర్తించిన విద్యా ర్థులకు నిర్ధార ణ పరీక్షలు జరిపి, తగు మందులు ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది హాస్టల్స్‌ను తరుచుగా సందర్శించి, విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిశీలించాలని ఆదేశిం చారు. సిక్ రూంలను పరిశీలించారు. వాడుక నీరు పరిసరాల్లో నిల్వ లేకుండా చూ సుకోవాలన్నారు. ప్రిన్సిపాల్స్ పోల వెంకట నాయుడు, జె.సంధ్య, కె.ఈశ్వరరావు, వైద్య సిబ్బంది, హాస్టల్ హెల్త్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనులకు పట్టాలు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

సాలూరు: గిరిజనులు సాగుచేస్తున్న భూములకు తక్షణం పట్టాలు పంపిణీ చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. బొర్రపణుకువలస, జిల్లేడువలస గ్రామస్థులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చేపడుతున్న నిరసన దీక్ష సోమవారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ దీక్ష వద్దకు వచ్చిన ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గిరిజనులను మోసం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక తహసీల్దార్ ఎం.ఆనందరావు మాట్లాడుతూ మార్చి పదో తేదీ లోపు పట్టాలు పంపిణీ చేస్తామని, అక్రమాలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్రి శ్రీను, కోరాడ ఈశ్వరరావు, ఎన్‌వై నాయుడు తదితరులు పాల్గొన్నారు.

1న జిల్లా సదస్సు

పాలకొండ: ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో పనిచేస్తున్న నీతి ఆయోగ్ ఆదేశానుసారం రాష్ట్ర ప్రభుత్వం చడీచప్పుడు లేకుండా భూ హక్కుల చట్టం 27/23 తీసుకొచ్చిందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ వచ్చే నెల 1న పాలకొండలో జిల్లా సదస్సును నిర్వహించనున్నారు. ఈమేరకు సోమవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గురుబిల్లి అప్పలనాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిమిడి రామ్మూర్తి, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చందక కేశవరావు, బలగ లక్ష్మీనాయుడు, జమ్ము చిన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

సీతంపేట: యాజమాన్య పద్ధతుల సాగుపై రైతులకు అవగాహన కల్పించామని ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ పి.సీతారాం తెలిపారు. సోమవారం పాత పనుకువలస సమీపంలో ఉన్న ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో గిరిజన రైతులకు అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన.. జీడిమామిడి సాగులో పురుగు తెగుళ్ల వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకుడు డా.ఎం.సురేశ్‌కుమార్, డా.బీవీకే భగవాన్, డా.శ్రీనివాస్‌రాజ్, డా.ఎన్‌బీవీ చలపతిరావు పాల్గొన్నారు.

సహజ సిద్ధ పంటలతో ఆరోగ్యం

వీరఘట్టం: సహజ సిద్ధంగా పండించిన కూరగాయలు ఆహార పదార్థాలు ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయని ఎంపీడీవో సాల్మన్‌రాజు అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీజ్డ్ నేచురల్ ఫార్మింగ్ సిబ్బంది సహజసిద్ధంగా పండించిన కూరగాయలు, ఆహార ఉత్పత్తులను ప్రదర్శన, అమ్మకానికి ఉంచారు. ప్రతి సోమవారం స్టాల్స్ ఏర్పాటు చేస్తామని మండల యాంకర్ మరడాన మారుతీ సింహాచలం తెలిపారు. ఈ స్టాల్స్‌ను పలువురు సిబ్బంది సందర్శించి కూరగాయలు కొనుగోలు చేశారు.

లాటరీ ద్వారా ప్లాట్లు

సాలూరు/రూరల్: సాలూరులో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్లును మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ సమక్షంలో బుడా ఏపీవో దేవ్‌కుమార్ సోమవారం ఆన్‌లైన్‌లో డ్రా తీశారు. ఈ టౌన్‌లో 150 గజాలు, 200 గజాలు, 240 గజాలు చొప్పున 106 ప్లాట్లును ఏర్పాటు చేశారు. వీటిలో స్థలాలు కొనుగోలు చేయడానికి 13 మంది ఉద్యోగులతో సహా 19 మంది పదిశాతం డిపాజిట్ చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఆన్‌లైన్ ద్వారా డ్రా తీసి ప్లాట్లును కేటాయించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణి, దరఖాస్తుదారులు హాజరయ్యారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



నిరసన తెలియజేస్తున్న మహిళలు

మక్కువ: పాడైన కొళాయిలను బాగు చేయించి, తాగునీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ మూలవలస గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికీ కొళాయిలు పథకంలో భాగంగా గత సంవత్సరం ఏర్పాటుచేసిన కొళాయిలు పాడైపోయాయని, మూడు నెలల నుంచి సక్రమంగా నీరు రావడం లేదని తెలిపారు. దీంతో తాగునీటికి తీవ్ర అవస్థలు పడుతున్నామని, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు తెలియజేసినా ఫలితం లేదన్నారు. ఈసందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పీడిక అసిరి మాట్లాడుతూ ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేయక ముందు నీరు సక్రమంగా వచ్చేదని, కొళాయిలను సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ రత్నాల పార్వతమ్మ, వార్డు మెంబర్లు పార్వతి, అమ్మడమ్మ తదితరులు పాల్గొన్నారు.

డబ్ల్యూటీవో ఒప్పందాలను వ్యతిరేకించండి



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల సభ్యులు

పార్వతీపురంటౌన్: రైతాంగానికి, కార్మికులకు, దేశ ప్రజలకు నష్టం కలిగించే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) ఒప్పందాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని మన్యం జిల్లా ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు బి.దాసు పిలుపునిచ్చారు. సోమవారం డబ్ల్యూటీవో ఒప్పందాలను నిరసిస్తూ ప్రజా సంఘాలు స్థానిక పాతబస్టాండ్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఢిల్లీ సరిహద్దు రైతు ఉద్యమానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కె.సాంబమూర్తి, రైతుకూలీ సంఘం నాయకులు వర్మ, శ్రీనునాయుడు పాల్గొన్నారు.

గౌరవ వేతనం ఇవ్వండి



నిరసన తెలుపుతున్న భజన గురువుల సంఘం

బెలగాం: ధర్మ ప్రచారం చేసే తమకు గౌరవ వేతనం ఇవ్వాలని భజన గురువుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి, డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆ సంఘం నాయకుడు సత్యనారాయణ మాట్లాడుతూ తమకు గౌరవం వేతనం ఇవ్వాలని కోరారు. హిందువులకు ప్రత్యేకంగా గీతా పాఠశాలలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ అనుమతి లేకుండా హిందువుల పండగలు జరుపుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. కోలాటం, చెక్క భజన, తప్పిటగుళ్లు, కాగడ భజనల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మాతృభాష విద్యా వలంటీర్లను కొనసాగించాలి



ధర్నా నిర్వహిస్తున్న భాషా వలంటీర్లు

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న మాతృభాష (సవరభాష) వలంటీర్లను కొనసగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సవర భాష అభివృద్ధి రాష్ట్ర కార్యదర్శి సవర డుంబు, గిరిజన ఆదివాసీ సంఘం జిల్లా కార్యదర్శి మండంగి లక్ష్మణరావు మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్ నెలలో భాషా వలంటీర్లను కొనసాగించాలన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి జూన్ నెలలో రెన్యూవల్ చేయాలని, సమాన పనికి వేతనం కల్పించాలని కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటీడీఏ పీవో కల్పనాకుమారికి మెమోరాండాన్ని అందించారు.

సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించండి

- కలెక్టర్, ఐటీడీఏ, ఎస్పీ కార్యాలయాల్లో 'స్పందన'

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలకు అధికారులు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలని ఇన్‌చార్జి జేసీ సి.విష్ణుచరణ్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ సి.విష్ణుచరణ్, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలతతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 140 అర్జీలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాథం, జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: పీవోకు సమస్యలు వివరిస్తున్న ఉపాధి సిబ్బంది



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

ఉపాధి సిబ్బంది నిరసన

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కంప్యూటర్ ఆపరేటర్ల జిల్లా సంఘ అధ్యక్షుడు అంబటి శంకరరావు, టెక్నికల్ అసిస్టెంట్ల అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, కార్యదర్శులు సురేష్, రామకృష్ణ.. ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఒత్తిడి ఎక్కువ, వేతనం తక్కువగా ఉందని వాపోయారు. ఉపాధిలో ఔట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తే సిబ్బందిని ఎఫ్‌టీఈఎస్‌గా గుర్తించాలని కోరారు. సమస్యలు పరిష్కారం కాకుంటే వారం రోజుల్లో సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందించారు.

ఐటీడీఏ స్పందనకు 35 వినతులు

సీతంపేట: ఐటీడీఏ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 35 వినతులు వచ్చినట్టు ఐటీడీఏ పీవో కల్పనాకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, ట్రైబుల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింహాచలం, ట్రాన్స్‌కో ఈఈ కృష్ణమూర్తి, సీడీపీవో రంగలక్ష్మి, డీడీ అన్నదొర, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.


న్యాయం చేస్తాం



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

బెలగాం: స్పందనలో వచ్చే ఫిర్యాదులను చట్టంపరంగా విచారణ జరిపి, తగిన న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్పందనలో మొత్తం ఆరు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. పోలీస్ శాఖ బాధితులకు న్యాయం చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఉద్యోగాల పేరుతో మోసపోవడం తదితర ఫిర్యాదుల వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఓ.దిలీప్‌కిరణ్, ఎస్బీ సీఐ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ వాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రా..కదలిరా సభకు తరలివెళ్లిన కార్యకర్తలు



శ్రీకాకుళంలో టీడీపీ నాయకులు

వీరఘట్టం: శ్రీకాకుళంలో సోమవారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిర్వహించిన రా..కదలిరా సభకు వీరఘట్టం మండలం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలివ వెళ్లారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, అరకు పార్లమెంట్ బీసీ సెల్ కన్వీనర్ పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, రామనాయుడు, చింతా ఉమ, నివర్తి శశి, వెంకటరమణ, చంటి, కుమార స్వామి తదితరులు ఇక్కడి నుంచి పయనమయ్యారు.

చోరీ జరగడం విచారకరం

గరుగుబిల్లి: ఖడ్గవలసకు చెందిన రైస్ మిల్లు యజమాని కిమిడి శ్రీరామ్మూర్తి నివాసంలో చోరీ జరగడం విచారకరమని తోటపల్లి దేవాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి డా.డి.పారినాయుడు, అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపు రెడ్డి సత్యనారాయణ అన్నారు. సోమవారం వారు శ్రీరామ్మూర్తిని పరామర్శించారు. శ్రీరామ్మూర్తి గతంలో శ్రీకోదండరామస్వామి ఆలయానికి రూ.కోటి విరాళంగా అందించారని చెప్పారు. చోరీ ఘటనపై పోలీసులు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

ప్రాసెసింగ్ యూనిట్ల పరిశీలన

పార్వతీపురం రూరల్: వెంకమ్మపేట, తదితర గ్రామాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను జోనల్ మేనేజర్ సాయి శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

పార్వతీపురం (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు వచ్చేనెల 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ తెలిపారు. దీనికి సంబంధించి సోమవారం కలెక్టరేట్‌లో పోస్టర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పొదుపు చేయడం నుంచి బ్యాంకింగ్, ఆన్‌లైన్ మోసాలు కూడా తెలియజేయాలని సూచించారు. లీడ్ జిల్లా మేనేజర్ మూర్తి మాట్లాడుతూ ఈనెల 26 నుంచి వారోత్సవాలు నిర్వహిస్తుండగా.. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, పదవినోదం తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, పార్వతీపురం ఆర్డీవో కె.హేమలత, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాల సమస్యల పరిష్కారంపై దృష్టి

- డీఎంహెచ్‌వో జగన్నాథరావు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాథరావు తెలిపారు. విధి నిర్వహణ, సమస్యలపై ఆశ కార్యకర్తలు, నోడల్ అధికారులతో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి అధ్యక్షతన ఆరోగ్య శాఖ కార్యాలయంలో గ్రీవెన్స్ సమా వేశాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీల వారీగా ఆశ కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను వారు వివరించారు. రోగులను రిఫర్ ఆసుపత్రులకు తీసుకొని వెళ్లేటప్పుడు ఆశ కార్యకర్తలకు అక్కడ నిరీక్షణ గది ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి.. కార్యాచరణ చేపడతామని డీఎంఅండ్‌హెచ్‌వో అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంవో డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్‌కుమార్, డెమో సన్యాసిరావు, హెచ్‌ఈ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లు ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీ

రాయగడ: ప్రధాని మోదీ ప్రజా రవాణాకు పెద్దపీట వేస్తూ దేశంలో సోమవారం 554 కొత్త రైల్వే స్టేషన్లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా రాయగడ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన ఒకటో నెంబరు ప్లాట్‌ఫారంను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో పార్లమెంటు సభ్యులు సప్తగిరి ఉలక మాట్లాడుతూ పార్లమెంటులో పలుమార్లు ఒడిశాకు కొత్తరైల్లు కావాలని వాణి వినిపించడంతో కేంద్ర ప్రభుత్వం నేడు ఒడిశాకు పలు కొత్త రైళ్లు, రైల్వే స్టేషన్లు ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న శాసన సభ్యుడు మకరంద ముదిలి మాట్లాడుతూ మన ఒడిశాకు పలు కేటాయించిన ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురాధ్యక్షుడు మహేష్ పట్నాయక్, సబ్ కలెక్టర్ కళ్యాణి, సంఘమిత్ర దేవి, ఎస్పీ హరీష్ బీసీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, బీజేపీ నేత బసంత ఉలక, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుర్గాప్రసాద్ పండా, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఒడిశా

క్లుప్తంగా..

విశ్వతేజ పుస్తకం ఆవిష్కరణ

పాలకొండ: మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత ఎన్టీ రామారావు జీవిత చరిత్రపై విశ్రాంత గ్రంథాలయాధికారి కనపాక చౌదరినాయుడు రచించిన 'విశ్వతేజ' పుస్తకాన్ని పాలకొండలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బొరోతు శంకరరావు, దుప్పాడ పారినాయుడు, బుడితి అప్పనాయుడు, వావిలపల్లి గోవిందరావు, ముంజేటి ఈశ్వరరావు, రెడ్డి భూషణ్, వి.వెంకటరమణ, వి.లక్ష్మణరావు, వై.విజయ్‌కుమార్, శ్యామ్ పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.6.52 లక్షలు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవమైన కోటదుర్గమ్మ అమ్మవారి హుండీలను సోమవారం తెరిచి లెక్కించారు. పట్టణంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం కార్య నిర్వాహణాధికారి కె.సర్వేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. జనవరి 9వ తేదీ నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు హుండీలను తెరిచి లెక్కించగా రూ.6,52,750 ఆదాయం వచ్చినట్టు పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు, సిబ్బంది, గ్రూపు దేవాలయాల సిబ్బంది లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

భామిని: బత్తిలి మండల పరిషత్ పాఠశాలను సీతానగరం ఎంఈవో సూర్యదేముడు సోమవారం పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల ప్రగతిని నమోదు చేసుకున్నారు. మండల పరిషత్‌లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. భామిని ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు.

టీడీపీ మీడియా కోఆర్డినేటర్‌గా శంకర్రావు

బెలగాం: టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్‌గా సీహెచ్ శంకర్రావును నియమించినట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర సోమవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. శంకర్రావు మీడియాకు అందుబాటులో పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన ప్రతి సమాచారం చేరవేస్తారని చెప్పారు.

సారా స్వాధీనం

సీతంపేట: కుడ్డపల్లి పంచాయతీ కోపరడంగ్ గ్రామ సమీపంలో అక్రమంగా తయారు చేస్తున్న 80 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ జగదీష్‌నాయుడు సోమవారం తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1600 లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేసినట్టు చెప్పారు. నిందితుల కోసం గాలిస్తున్నామని తెలిపారు.